క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

కాటారం: మండలంలోని దామెరకుంటలో గల తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల కళాశాలలో ఇంర్మీడియట్ ప్రథమ సంవత్సరం లో మిగిలిన సీట్లను భర్తీ చేయడానికి ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ రజిత ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ, బైపీసీ విభాగాల్లో సీట్లు ఖాళీగా ఉన్నట్లు పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థినులు రూ.100 చెల్లించి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ నెల 31 వరకు గడువు ఉందని అర్హులైన విద్యార్థినులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నాణ్యమైన విత్తనాలు విక్రయించాలి



శాయంపేట: మండలంలోని ఫర్టిలైజర్ షాపుల యజమానులు నాణ్యమైన విత్తనాలు విక్రయించాలని ఏఓ గంగాజమున అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ షాపులను ఆకస్మిక తనిఖీ చేసి రికార్డులను, విత్తనాలను, ఎరువులను పరిశీలించారు. అనంతరం విత్తనాల కొనుగోలు రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైతులు విత్తనాలు కొనుగోలు చేసిన అనంతరం రసీదు తీసుకోవాలన్నారు. లైసెన్స్ కలిగిన డీలర్ వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలని, అనామకుల వద్ద కొనుగోలు చేయొద్దని సూచించారు. బిల్లును జాగ్రత్తగా దాచిఉంచాలని అన్నారు. గ్రామాల్లో విడివిత్తనాలు లేదా నకిలీ విత్తనాలు విక్రయించినట్లు అనుమానమొస్తే వెంటనే వ్యవసాయశాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

మహిళలు స్వయంకృషితో ఎదగాలి



శాయంపేట : మహిళలు స్వయంకృషితో ఎదగాలని ఎంపీటీసీ బత్తిని రజిని అన్నారు. మండలంలోని గట్లకానిపర్తి గ్రామంలో ప్రజ్వల్ ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ మహిళా సాధికారత ఆధ్వర్యంలో ఫీల్డ్ ఫెసిలిటర్ కల్పన 20మంది మహిళలకు జన శిక్షణ సంస్థాన్ సహకారంతో మూడు నెలల టైలరింగ్ కోర్సును పూర్తిచేసి సోమవారం సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా రజని మాట్లాడుతూ.. మహిళలు ఆర్థికంగా ఎదగాలని, అందరికీ ఆదర్శంగా నిలువాలని అన్నారు. కుట్టుశిక్షణ పొందిన పత్తిపాక మహిళా సంఘం సభ్యులకు జీవనోపాధి కోసం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల యూనిఫాం కట్టేందుకు ఉపాధి కల్పించడం జరిగిందని అన్నారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి

మల్హర్: మండలంలోని అన్సాన్‌పల్లి గ్రామానికి చెందిన నరేష్(35) అనే వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. కొయ్యూరు ఎస్సై నరేష్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన నరేష్ ఈనెల 21 సాయంత్రం 5 గంటల సమయంలో అతడి ఇంటి వద్ద ఉన్న మామిడి చెట్టు పైకి ఎక్కి మామిడి కాయాలు కోస్తున్నాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు చెట్టుపై నుంచి జారీ కింద పడటంతో మెడ భాగంలో బలమైన గాయమయింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం భూపాలపల్లి 100 పడకల ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోరకు హైదరాబాదులోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. బావమరిది రాజబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

నెహ్రూకు ఘన నివాళి



శాయంపేట : భారతదేశ మొదటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ వర్ధంతిని మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాయలంలో సోమవారం నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నెహ్రూ ఆశయాలను కొనసాగించాలని కోరారు. నాయకులు అబ్బు ప్రకాశ్‌రెడ్డి, మల్లాజి, చిందం రవి, కృష్ణమూర్తి, సాంబయ్య, భాస్కర్, సుధాకర్‌రావు, కుమారస్వామి పాల్గొన్నారు.

వెంకటాపురం(ఎం): పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ శబరీష్



గోవిందరావుపేట: పోలింగ్ కేంద్రం వద్ద డీఎస్పీ రవీందర్



ములుగు: పోలింగ్ సామగ్రిని స్వీకరిస్తున్న ఆర్డీఓ సత్యపాల్‌రెడ్డి



వాజేడు: పోలింగ్ కేంద్రం వద్ద అధికారులు



ప్రశాంతంగా ముగిసిన పోలింగ్



గోవిందరావుపేట: ఏర్పాట్లను పరిశీలిస్తున్న తహసీల్దార్ సృజన్ కుమార్

వాజేడు: ఖమ్మం–వరంగల్–నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉపఎన్నిక సోమవారం మండలంలో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. మండలంలో 555 ఓట్లు ఉండగా 426 ఓట్లు పోలయ్యాయి. పురుషులు 266 మంది, మహిళలు 160 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రం వద్ద వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు.

గోవిందరావుపేట : మండలంలో ఉదయం 8 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 4 గంటలకు ముగిసింది. పోలింగ్ కేంద్రాల్లో క్యూలో ఉన్న వారికి ఓటు వేసేందుకు అధికారులు అవకాశం కల్పించారు. ముందస్తు చర్యల్లో భాగంగా పోలింగ్ సెంటర్ పరిసరాల్లో 144 సెక్షన్ విధించినట్లు డీఎస్పీ ఎస్.రవీందర్ తెలిపారు. తహసీల్దార్ సృజన్‌కుమార్ పోలింగ్ కేంద్రంలో పోలింగ్ సిబ్బందికి, ఓటర్లకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశారు. పస్రా సీఐ శంకర్, ఎస్సై కమలాకర్ సంయుక్తంగా పోలింగ్ కేంద్రాన్ని ఎప్పటికప్పుడు క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించారు. పోలింగ్ ముగిసే సమయానికి 71.65 శాతం నమోదైంది. మండలంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో రెండు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా 199 పోలింగ్ స్టేషన్‌లో 506 మంది ఓటు వేశారు. 200 పోలింగ్ బూత్‌లో 394 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు.

ఎస్ఎస్‌తాడ్వాయి : మండలంలో 694 ఓటర్లకు 346 మంది పురుషులు, 192 మంది మహిళల ఓట్లు పోలయ్యాయి. ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి పోలింగ్ కేంద్రం వద్ద సిబ్బందితో కలిసి గట్టి బందోబస్తు నిర్వహించారు. పోలింగ్ అనంతరం బాక్సులను జిల్లా కేంద్రానికి తరలించారు.

కన్నాయిగూడెం : మండల పరిధిలో 294 ఓట్లు ఉండగా 227 ఓట్లు పోలయ్యాయి. పురుషులు 144 మంది, 83 మంది మహిళలు ఓటు హక్కును వినియోగించుకున్నారు. దీంతో మండల పరిధిలో 77.21 శాతం ఓట్లు పోలయ్యాయి.

తొలిసారి ఓటేసిన యువత

మండలంలోని యువకులు తొలిసారి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొదటిసారి ఓటు వేశామని వారు సంతోషం వ్యక్తం చేశారు.

వెంకటాపురం(కె): మండలంలో 81.42 శాతం ఓటింగ్ నమోదైంది. మొత్తం 723 మంది ఓటర్లకుగాను 701 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆలుబాకలోని 211 పోలింగ్ కేంద్రంలో 183 మంది ఓటర్లకు 162 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు. వెంకటాపురం మండల కేంద్రంలోని 210 పోలింగ్ కేంద్రంలో 540 మందికి 443 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ఏటూరునాగారం: మండలంలో 80 శాతం పోలింగ్ నమోదైంది. మండంలో మొత్తం 1126 మంది ఓటర్లుండగా 901 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రం 204 బూత్‌లో 544 మంది ఓటర్లకు 444 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 205 బూత్‌లో 581 మందికి 457 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

వెంకటాపురం(ఎం): మండలంలో 72 శాతం పోలింగ్ నమోదైనట్లు తహసీల్దార్ సదానందం పేర్కొన్నారు. మండలంలో 1308 మంది ఓటర్లు ఉండగా 944 మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నట్లు వెల్లడించారు. మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో గల పోలింగ్ కేంద్రాన్ని జిల్లా ఎస్పీ శబరీష్ సందర్శించి పోలీసులకు సూచనలు అందించారు. పోలింగ్ సందర్భంగా ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా వెంకటాపురం ఎస్సై చల్లా రాజు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. దివ్యాంగులైన పట్టభద్రులు కూడా ఓటుహక్కును వినియోగించుకొని ఆదర్శంగా నిలిచారు. సాయంత్రం 4 గంటలు దాటిన తర్వాత ముగ్గురు పట్టభద్రులు ఓటు వేయడానికి రాగా పోలింగ్ సమయం ముగియడంతో అధికారులు లోపలికి అనుమతించలేదు.



వాజేడు: పోలింగ్ కేంద్రం వద్ద బారులుదీరిన ఓటర్లు



ములుగు: దివ్యాంగురాలిని తీసుకెళ్తున్న సిబ్బంది



వెంకటాపురం(ఎం): ఓటుహక్కు వినియోగించుకున్న దివ్యాంగురాలు



ములుగు: ఓటు హక్కును వినియోగించుకున్న బాలింతలు



ఎస్ఎస్ తాడ్వాయి: ఓటు హక్కు వినియోగించుకున్న మహిళలు



వాజేడు: పోలింగ్ కేంద్రం వద్ద వైద్యశిబిరం



కన్నాయిగూడెం: ఓటు హక్కు తొలిసారి వినియోగించుకున్న యువకులు



వెంకటాపురం(కె): పోలింగ్ కేంద్రం వద్ద బారులుదీరిన ఓటర్లు



వెంకటాపురం(ఎం): బందోబస్తులో ఎస్సై రాజు



ఏటూరునాగారంలో..





ములుగు: ఓటర్లకు మందులు అందజేస్తున్న సిబ్బంది



ఏటూరునాగారం: ఓటరు స్లిప్‌లు అందిస్తున్న సిబ్బంది



ఏటూరునాగారం: ఓటు హక్కు వినియోగించుకున్న నాయకులు



వెంకటాపురం(ఎం): సాయంత్రం 4 తర్వాత వస్తున్న ఓటర్లను లోపలికి రాకుండా ఆపుతున్న సిబ్బంది

ములుగు జిల్లాలో ఓటింగ్ వివరాలు

పోలింగ్ కేంద్రం	మొత్తం ఓటర్లు	పోలైన ఓట్లు	శాతం
195	827	598	72.30
196	753	530	70.38
197	865	638	74.21
198	646	478	73.99
199	738	506	68.56
200	518	394	76.06
201	694	496	71.46
202	614	448	72.96
203	694	538	77.52
204	544	444	81.61
205	582	457	78.52
206	294	227	77.21
207	906	645	71.19
208	326	247	75.76
209	555	426	76.75
210	560	443	79.10
211	183	162	88.52
	10299	7677	74.54

పోగొట్టుకున్న సెల్‌ఫోన్లు అందజేత

కాటారం: కాటారం పోలీస్‌స్టేషన్ పరిధిలో పోగొట్టుకున్న రెండు సెల్‌ఫోన్లను రికవరీ చేసి పోలీసులు సోమవారం బాధితులకు అందజేశారు. నరిగె నిర్మల, పాగె రవీందర్ ఇటీవల సెల్‌ఫోన్‌లను పోగొట్టుకున్నారు. పోలీసులకు సమాచారం అందించి సీఈఐఆర్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేయించుకున్నారు. పోర్టల్‌ను ఉపయోగించి బాధితులు పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లను గుర్తించినట్లు ఎస్సై మ్యాక అభినవ్ తెలిపారు. పోలీసులు తమ సెల్‌ఫోన్‌లు గుర్తించి ఇవ్వడంతో బాధితులు హర్షం వ్యక్తం చేసి ఎస్సై, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.



సెల్‌ఫోన్ అందజేస్తున్న ఎస్సై అభినవ్, సిబ్బంది

రమాబాయి అంబేడ్కర్ వర్ధంతి

శాయంపేట : మండలంలోని పత్తిపాకలో పూలే యువజన సంఘం ఆధ్వర్యంలో సోమవారం రమాబాయి అంబేడ్కర్ వర్ధంతిని సోమవారం నిర్వహించారు. అంబేడ్కర్ విద్యార్థి సమాఖ్య జిల్లా అధ్యక్షుడు నాగుల పవన్‌కల్యాణ్ ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పూలే యువజన సంఘం అధ్యక్షురాడు చెల్పూరి శ్రీకాంత్, ఏబీఎస్ఎఫ్ జిల్లా సహాయకార్యదర్శి బాబు రజని, మిథున్, చిన్ను, జయ, శ్యామల, పాపయ్య పాల్గొన్నారు.



చిత్రపటానికి పూలమాల వేస్తున్న నాయకులు

‘ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదు’

కాటారం: మంత్రి శ్రీధర్‌బాబుపై బీజేపీ నాయకులు గోమాసే శ్రీనివాస్, చల్ల నారాయణరెడ్డి చేసిన వ్యాఖ్యలు అసత్యమని అలాంటి అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకునేది లేదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వేమునూరి ప్రభాకర్‌రెడ్డి, ఎంపీపీ పంతకాని సమ్మయ్య అన్నారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి బీజేపీ నాయకులు చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. చల్ల నారాయణరెడ్డి తన రాజకీయ ప్రస్థానం దివంగత నేత శ్రీపాదరావుతో మొదలుపెట్టి, మంత్రి శ్రీధర్‌బాబు ద్వారా అనేక పదవులు పొంది వారిపైనే విమర్శలు చేయడం శోచనీయం అన్నారు. నారాయణరెడ్డి రాజకీయ స్వలాభం కోసం పూటకో పార్టీ మారుతూ ప్రజల్లో ఉనికిని కోల్పోయి మతిస్థిమితం లేకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు. పదవిలో ఉన్నప్పుడు ఏ రోజు రైతుల కష్టాలు ఎరుగని నారాయణరెడ్డి ఇప్పుడు రైతులపై మొసలి కన్నీరు కార్చడం హాస్యాస్పదకం అన్నారు. ఈ సమావేశంలో యూత్ అధ్యక్షుడు చీమల సందీప్, మహిళా అధ్యక్షురాలు జాడి మహేశ్వరీ, తెప్పెల దేవేందర్ రెడ్డి, ఆంగోతు సుగుణ, అంగజాల అశోక్, కొట్టె ప్రభాకర్, కుంభం రమేశ్, దబ్బెట రాజేశ్, ఎలుబాక సుజాత, మొగిలి, శ్రీకాంత్, కిరణ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

ఆటలు ఆడేదెలా?



తుప్పు పట్టిన క్రీడా సామగ్రి



కనుకునూర్‌లో చెట్లతో నిండిన క్రీడా ప్రాంగణం

- నిరుపయోగంగా క్రీడా ప్రాంగణాలు
- మైదానంలో పెరిగిన పిచ్చిమొక్కలు

మహాముత్తారం: గత ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా ప్రారంభించిన తెలంగాణ క్రీడా ప్రాంగాణాలు నిరుపయోగంగా ఉన్నాయి. వీటి ఏర్పాటులో గత ప్రభుత్వం నిబంధనలు పాటించలేదనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. అరకొర సౌకర్యాలతో నామమాత్రంగానే పనులు చేపట్టారు. దీంతో అవి వాడకంలో లేకుండా పోతున్నాయి. మండలంలో 24 గ్రామపంచాయతీల పరిధిలో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేశారు. ప్రతీ క్రీడా ప్రాంగణం కనీసం 20 గుంటల భూమిలో ఏర్పాటు చేయాలనే లక్ష్యం పెట్టుకోగా ఆ నిబంధనలు పాటించలేదు. మైదానంలో ఖోఖో, వాలీబాల్, లాంగ్‌జంప్, వ్యాయమం కోర్టులు ఏర్పాటు చేయాల్సి ఉంది. అలాంటివి ఏమీ లేకుండా కోర్టులు మాత్రమే వేశారు. ఒక్కో వాలీబాల్ కోర్టు 26 మీటర్ల పొడవు 15మీటర్ల వెడల్పు ఉండాల్సి ఉండగా నిబంధనలు పాటించలేదు. ఒక్కొక్క క్రీడా ప్రాంగణానికి రూ.2లక్షల వరకు వెచ్చించి ఎన్ఆర్ఈజీఎస్ కింద పనులు చేశారు. కాని ప్రాంగణాలు నిరుపయోగం కావడంపై ప్రజలు అసంతృప్తి చెందుతున్నారు.

అక్రమంగా పశువుల తరలింపు

వెంకటాపురం(కె): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం నుంచి హైదరాబాద్‌కు డీసీఎం వ్యాన్‌లో పశువులను అక్రమంగా తరలిస్తుండగా మండల కేంద్రంలో పోలీసులు పట్టుకున్న సంఘటన సోమవారం చోటు చేసుకుంది. వెంకటాపురం ఎస్సై అశోక్ తెలిపిన సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. సోమవారం మండల కేంద్రంలోని శివాలయం సమీపంలో వాహన తనిఖీలను నిర్వహిస్తుండగా చర్ల మండలం నుంచి వెంకటాపురం వైపునకు వస్తున్న డీసీఎం వ్యాన్‌ను ఆపి తనిఖీ చేసినట్లు తెలిపారు. కాగా ఈ వ్యాన్‌లో అక్రమంగా రెండు లక్షల ఎనభై వేల రూపాయల విలువ గల 26 పశువులను తరలిస్తున్నారని పేర్కొన్నారు. దీంతో పశువులను తరలిస్తున్న వ్యక్తులను అదుపులోకి తీసుకోని విచారించగా వెంకటాపూర్ మండలానికి చెందిన సైయ్యద్ ఇర్షాద్, పాల్వంచకు చెందిన సయ్యద్ గౌస్‌లు చర్ల మండలం నుంచి పశువులను తీసుకువస్తున్నట్లు తెలిపినట్లు పేర్కొన్నారు. పశువులను పాల్వంచ గోశాలకు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు.



పోలీసులు పట్టుకున్న పశువులు